క్లుప్తంగా

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గార్ల: గార్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 21 లోపు దరఖాస్తు చేసుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నరసమ్మ బుధవారం తెలిపారు. కళాశాలలో కామర్స్–2, తెలుగు –1, కంప్యూటర్ సైన్స్–1 గెస్ట్ లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. పీజీతోపాటు పీహెచ్‌డీ, నెట్, సెట్ అదనపు అర్హత కలిగి ఉన్న వారికి ఎంపికలో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 22న కళాశాలలో ఇంటర్వ్యూలు ఉంటాయని ఆమె వెల్లడించారు.

శిథిలావస్థలో ఉన్న ఇళ్లు ఖాళీ చేయాలి

మహబూబాబాద్: వర్షాలు విస్తారంగా కురుస్తున్న నేపథ్యంలో శిథిలావస్థలో ఉన్న ఇళ్ల యాజమానులు ఇంటిని ఖాళీ చేసి సహకరించాలని టీపీఎస్ ప్రవీణ్ బాబు కోరారు. బుధవారం మున్సిపల్ సిబ్బంది ఇళ్ల వద్దకు వెళ్లి తెలియజేశారు. కార్యక్రమంలో బిల్ కలెక్టర్లు నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్, టీపీఓ విభాగం సిబ్బంది శ్రీకాంత్, కృష్ణయ్య, రత్నరాజు, పుష్పరాజ్ పాల్గొన్నారు.

ఓటింగ్‌పై విద్యార్థులకు అవగాహన



మహబూబాబాద్ అర్బన్: విద్యార్థి దశ నుంచి ఓటు హక్కుపై అవగాహన తెలుసుకోవాలని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల హెచ్‌ఎం కిషన్‌యక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పత్తిపాక గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో బుధవారం ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలతో ఓటింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీరాందాస్, వెంకటయ్య, రవీందర్, భద్రాజి, కిషన్, శంకర్ పాల్గొన్నారు.

నల్లబెల్లం స్వాధీనం



నెల్లికుదురు: ప్రభుత్వం నిషేధించిన నల్లబెల్లం, గంజాయి లాంటి వ్యాపారాలను మానుకోకుంటే కఠిన చర్యలు తప్పవని ఎస్సై క్రాంతికిరణ్ అక్రమ వ్యాపారులను హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ.. మహబూబాబాద్ మండలం అమనగల్ గ్రామానికి చెందిన ఇల్లబోయిన సందీప్ చిత్తూరు నుంచి బొలేరో వాహనంలో 56 బస్తాల్లో 28క్వింటాళ్ల నల్లబెల్లం. పటికను తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి సందీప్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

గార్ల: పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ బుధవారం పాకాల ఏటి వద్ద వర్షంలో సీపీఐ నాయకులు నిరసన తెలిపారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాసరావు మాట్లాడారు. బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని దశాబ్దాల కాలంగా పోరాటాలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి జంపాల వెంకన్న, జనార్దన్, మాగం లోకేష్, శ్రీరాములు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మహబూబాబాద్ రూరల్: ఆగకుండా కురుస్తున్న వర్షాలతో మహబూబాబాద్ నియోజకవర్గ ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాంనాయక్ బుధవారం తెలిపారు.ప్రజలకు కురుస్తున్న వర్షాలతో ఏ విధమైన ఇబ్బందులు వచ్చినా నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఆదుకోవాలని కోరారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

ఎస్పీ శరత్‌చంద్ర పవార్

మహబూబాబాద్ రూరల్: సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. రోజురోజుకూ సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. వర్క్ ఫ్రమ్ హోమ్ అంటూ గూగుల్‌లో వెతికిన సందర్భంలో, ప్రొఫైల్, రెస్యూమ్ ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేస్తున్న సమయంలో సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోతున్నారని తెలిపారు. ఆన్‌లైన్‌లో సెర్చ్ చేసిన వివరాలతో కొందరు కేటుగాళ్లు మోసం చేయడానికి సిద్ధంగా ఉన్నారని వివరించారు. సైబర్ నేరగాళ్లు కొత్తగా ఉద్యోగం కోసం గూగుల్ సెర్చ్ ఇంజిన్‌లో వెతికే నిరుద్యోగ యువతను టార్గెట్ చేసి మోసం చేస్తున్నారన్నారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930కి ఫోన్ ద్వారా గానీ, లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీవైబీఈఆర్ సీఆర్ఐఎంఈ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ద్వారా గానీ, లేదా సైబర్ క్రైమ్ పోలీసులకు గానీ సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఎడతెరిపిలేని వాన



గూడూరు: కేశ్యతండాలో జేసీబీతో నీటిని తొలగిస్తున్న సర్పంచ్



కొత్తగూడ: మొండ్రాయిగూడెం వాగును పరిశీలిస్తున్న తహసీల్దార్ చందా నరేష్



దంతాలపల్లిలో విరిగిన చెట్టు



గార్ల: పాకాల ఏరు చెక్‌డ్యాంపై నుంచి ప్రవహిస్తున్న నీరు

తొర్రూరు: రెండు రోజులుగా మండల వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వాన పడుతోంది. సోమవారం అర్ధరాత్రి మొదలైన వర్షం బుధవారం దాకా కురుస్తూనే ఉంది. వానాకాలం సాగు అదును పోతుందన్న ఆందోళనలో ఉన్న అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. నాగళ్లు, గుంటుకలతో సైసై అంటూ కాడెడ్లను అదిలిస్తూ ఖుషీఖుషీగా శివార్లవైపు కదిలారు. నీళ్లు లేక బోసిబోయిన కుంటలు, చెరువుల్లోకి జోరుగా వరద నీరు చేరింది.

గూడూరు: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గూడూరు శివారు కేశ్యతండాలో రోడ్డుపై నీరు నిలిచి తండావాసులు ఇబ్బందులు పడ్డారు. బుధవారం ఈ విషయం తెల్సుకున్న సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్ తండాకు చేరుకొని సమస్యను పరిశీలించారు. వెంటనే జేసీబీతో రోడ్డుపై నిలిచిన నీటిని సమీప పంట పొలాల వైపు తరలించారు.

శిథిలావస్థకు చేరిన ఇళ్ల పరిశీలన

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉన్న ఇళ్లను బుధవారం మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లు కూలే ప్రమాదం ఉన్నందున ఇళ్లలో నివాసం ఉండేవారు ఖాళీ చేయాలని, చుట్టు ప్రక్కలవారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బయ్యారం: బయ్యారం, గంధంపల్లి–కొత్తపేట, వెంకట్రాంపురం, ఉప్పలపాడు, రామచంద్రాపురం, కంబాలపల్లి, నారాయణపురం తదితర గ్రామాల్లో బుధవారం ఎడతెరిపిలేకుండా వర్షం కురిసింది. మహబూబాబాద్–భద్రాద్రి జిల్లాల సరిహద్దుల్లో కురుస్తున్న వర్షంతో మసివాగు, రాళ్లవాగులో వరద ప్రవాహం ప్రారంభమైంది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మరిపెడ రూరల్: భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణ సూచనల మేరకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతేనే తప్ప బయటకు రావద్దని మరిపెడ తహసీల్దార్ పిల్లి రాంప్రసాద్ సూచించారు. అత్యవసరమైతే తహసీల్దార్, ఎంపీడీఓ, ఎస్సైలకు ఫోన్ చేయాలని సూచించారు.

గార్ల: పాకాల ఏరు బుధవారం తెల్లవారుజాము నుంచి చెక్‌డ్యాం పైనుంచి ప్రవహిస్తుంది. పాకాల ఏరు చెక్‌డ్యాం పైనుంచి ప్రవహిస్తుండటంతో గార్ల నుండి రాంపురం, మద్దివంచ గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి.

చిన్నగూడూరు: మండలంలోని అంతర్గత రోడ్లు వరద నీటితో కాల్వలను తలపిస్తున్నాయి. కొంత కాలంగా ముఖం చాటేసిన వర్షం నైరుతి రుతుపవనాల రాకతో కురుస్తున్న వర్షానికి మండల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దంతాలపల్లి: మండలకేంద్రంలో బాలాజీ ఫంక్షన్ హాల్ దగ్గర సూర్యాపేట, ప్రధాన రహదారిపై బుధవారం పెద్ద చెట్టు కూలిపోయింది. కానిస్టేబుల్ గణేష్ సంఘటన స్థలం చేరకొని క్రేన్ సహాయంతో చెట్టును తొలగించారు.

ప్రవహిస్తున్న వాగులు దాటొద్దు

కొత్తగూడ: ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులను దాటే ప్రయత్నం చేయవద్దని స్థానికులకు తహసీల్దార్ చందా నరేష్ సూచించారు. మండలంలోని మొండ్రాయిగూడెం వాగు, ముస్మి వాగు, వేలుబెల్లి సమీపంలోని కత్తెర్ల వాగులను బుధవారం ఆయన పరిశీలించారు. వాగులు దాటేందుకు ప్రయత్నించి ప్రాణాలమీదకు తెచ్చుకోవద్దని హెచ్చరించారు. వాగులు ఉధృతంగా ప్రవహించే సమయంలో వీఆర్‌ఎలు వాగుల వద్ద ఉండాలని ఆదేశించారు.



మానుకోటలో కూలిన వృక్షం



డోర్నకల్: శిథిలావస్థకు చేరిన ఇంటిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్



బయ్యారం: వరదనీటితో ప్రవహిస్తున్న రాళ్లవాగు

మానుకోటలో నేలకూలిన మహావృక్షం

మహబూబాబాద్ రూరల్: జిల్లాలో కురుస్తున్న వర్షానికి స్థానిక శ్రీవేంకటేశ్వర బజారులో గల స్వయంభు శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవాలయ ఆవరణలో ఉన్న వందల ఏళ్ల నాటి మహావృక్షమైన చింతచెట్టు బుధవారం ఉదయం నేలకూలింది. కాగా మహావృక్షం నేలకూలిన సమయంలో దేవాలయ ఆవరణలో ఉత్తర ద్వార దర్శన శ్రీవెంకటేశ్వర స్వామి వారి ఎదుట అంజన్న విగ్రహం ఉన్న రేకుల షెడ్డు పూర్తిగా ధ్వంసమైంది. కానీ ఆ రేకుల షెడ్డు కింద ఉన్న భక్త ఆంజనేయస్వామి వారి విగ్రహం మాత్రం చెక్కుచెదరకుండా అలాగే ఉండిపోయింది.

విద్యుత్ మోటార్ చోరీ

మరిపెడ రూరల్: ఓ రైతు విద్యుత్ మోటార్ చోరీకి గురైన సంఘటన మండలంలోని జీన్యతండాలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. జీన్యతండాకు చెందిన రైతు బానోతు నాగేష్ తండ శివారులోని ఎస్సారెస్పీ కాల్వ సమీపంలోని తన వ్యవసాయ బావికి బిగించుకొని వ్యవసాయాన్ని సాగు చేస్తున్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు పైపులకు బిగించి ఉన్న విద్యుత్ మోటార్ అపహరించుకొని వెళ్లినట్లు బాధిత రైతు నాగేష్ తెలిపాడు.

ద్విచక్రవాహనం చోరీ

దంతాలపల్లి: మండలంలోని తూర్పుతండాకు చెందిన గుగులోత్ హరి స్ప్లెండర్ ప్లస్ బైకు ఈనెల 16న వ్యయసాయ బావి వద్దకు తీసుకెళ్లాడు. పని చేసుకొని వచ్చి చూసేసరికి బైకు కనిపించలేదు. హరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ బాబు తెలిపాడు.

కేసు నమోదు

కేసముద్రం: ఒకరిని దుర్భాషలాడుతూ, దాడిపాల్పడిన ఘటనలో ఓ వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కేసముద్రం విలేజ్ శివారు ఎన్టీఆర్ నగర్ కాలనీకి చెందిన భుక్యా సునీల్‌ను, ఈనెల 16న ఇదే కాలనీకి చెందిన మెంతుల నవీన్ అనే వ్యక్తి దుర్భాషలాడుతూ, దాడి చేసి నెట్టేయడంతో అతడి తలకు తీవ్రగాయమైంది. దీంతో బాధితుడి తల్లి మంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం నవీన్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి ఒకరి మృతి

నెల్లికుదురు: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడడంతో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని మధనతుర్తి గ్రామ చెరువు కట్టపై బుధవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దుర్గాభవాణి తండా శివారు భగ్నతండాకు చెందిన భూక్య చంటి (25) తన ట్రాక్టర్‌తో మండలంలోని మధనతుర్తి గ్రామంలో ఓ రైతు పొలం దున్నేందుకు వెళ్లి వస్తుండగా ప్రమాదశాత్తు చెరువు కట్టపై నుంచి అదుపు తప్పి బోల్తా కొట్టింది. దీంతో ట్రాక్టర్ నడుపుతున్న చంటి అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు.

రైతుల చేతిలో కాంగ్రెస్‌కు ఓటమి తప్పదు

● ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ

గార్ల: రైతులకు 3 గంటలు కరెంట్ ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీకి రానున్న ఎన్నికల్లో రైతులు తగిన గుణపాఠం చెప్పాలని ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. బుధవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు మండలంలోని ముల్కనూరు పంచాయతీ దుబ్బగూడెం రైతు వేదిక భవనంలో జరిగిన రైతు సదస్సులో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు 3 గంటలు కరెంట్ ఇస్తే సరిపోతుందన్న వ్యాఖ్యలు, రైతుల మనోభావాలు దెబ్బతినే విధంగా ఉన్నాయని ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, ఎంపీపీ శివాజీచౌహాన్, సర్పంచ్‌లు వట్టం జానకిరాణి, ధరావత్ సక్రు, గంగావత్ రుక్మిణీ, ఆర్.శంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ

సీఐగా బాబురావు

బయ్యారం: గార్ల–బయ్యారం సీఐగా రామగుండం సీసీఆర్‌బీ సీఐగా పనిచేస్తున్న కోట బాబురావును నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు వెలుబడ్డాయి. ఇప్పటి వరకు సీఐగా పనిచేస్తున్న బాలాజీని బదిలీ చేసి హైదరాబాద్ ఐజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు.

తొర్రూరు ఎస్సైగా జగదీష్

తొర్రూరు: తొర్రూరు ఎస్సైగా కూచిపూడి జగదీష్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఇప్పటి వరకు దంతాలపల్లి ఎస్సైగా పని చేశారు. బుధవారం మహబూబాబాద్‌లో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

దంతాలపల్లి ఎస్సైగా రమేష్ బాబు

దంతాలపల్లి: నూతన ఎస్సైగా సీహెచ్.రమేష్ బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న కూచిపూడి జగదీష్ బదిలీ పై తొర్రూరు వెళ్లారు.

నులిపురుగుల నివారణకు కృషి

చిన్నగూడూరు: నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉగ్గంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కరుణాకర్ అన్నారు. నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉగ్గంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణకు ఆశాలు, అంగన్‌వాడీ టీచర్స్, ఏఎన్‌ఎంలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్యాంసుందర్, సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, రాధాకుమారి, అంగన్‌వాడీ సూపర్‌వై కవిత పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణే లక్ష్యం

నెల్లికుదురు: నులిపురుగుల నివారణే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని మండల వైద్యాధికారి వంశీకృష్ణ ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలు, ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో బుధవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ గుగులోతు రాము, ఐసీడీసీఎస్ సూపర్ వైజర్, సీహెచ్‌ఓ శాంతమ్మ, వైద్యసిబ్బంది మెరినా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



చిన్నగూడూరు: మాట్లాడుతున్న వైద్యాధికారి కరుణాకర్

విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ వేయాలి

గూడూరు: నులిపురుగుల నివారణతో పిల్లల్లో ఎదుగుదల ఉంటుందని, విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని డాక్టర్ యమున అన్నారు. మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో బుధవారం మండల టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రోజారాణి, సీడీపీఓ నీలోఫర్ అజ్మీ, డాక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

యాత్రను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

మహబూబాబాద్ అర్బన్: నేడు జిల్లా కేంద్రంలో జరగనున్న పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర బస్సు యాత్రను విజయవంతం చేయాలని టీపీస్టీఎస్ఈయూ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పూసపాటి నాగమణి, గోపు లక్ష్మీకాంత్ బుధవారం పిలుపునిచ్చారు. రెండు వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులతో బస్సుయాత్ర జిల్లాలోకి అడుగు పెడుతుందన్నారు. బుధవారం ఈదుల పూసపల్లి కాంప్లెక్స్ పరిధిలో మండల అధ్యక్షుడు ధారావత్ వీరన్న అధ్యక్షతన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు చంద్రమౌళి , రాష్ట్ర కార్యదర్శి సోమ గోవర్ధన్, నాయకులు రవి, రవిచంద్ర, మండల ప్రధాన కార్యదర్శి అశోక్, జిల్లా బాధ్యులు రఫీ, మురళి, రంజిత్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు ప్రశంసనీయం

డోర్నకల్: విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న తెలిపారు. స్థానిక ఎంపీపీఎస్ ఆంగ్ల పాఠశాలలలో రిటైర్డ్ ఉపాధ్యాయురాలు నొషీన్, మహబూబాబాద్ రైల్వే స్టేషన్ మేనేజర్ రాజమల్ల కనకరాజ్, పాఠశాల ఉపాధ్యాయులు ధూర్ ప్రభురాజ్, వెంకట్రావ్, గౌసియాబేగం, జాస్మిని సహకారంతో సమకూర్చిన లక్ష రూపాయల విలువైన షూస్, స్కూల్ బ్యాగులు, నోటు పుస్తకాలు, టైలు, బెల్టులను బుధవారం విద్యార్థులకు చైర్మన్ వీరన్న పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ పూల్‌చంద్, సీఐ రవికుమార్, వార్డు కౌన్సిలర్ సురేందర్‌జైన్, హెచ్‌ఎం మరియామాణిక్యం, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న చైర్మన్, సీఐ

‘ఎంపీపీనుంచి రక్షణ కల్పించాలి’

బయ్యారం: ఎంపీపీ చేపూరి మౌనిక ఆమె అనుచరులు దాడులకు పాల్పడుతున్నారని వారి నుంచి రక్షణ కల్పించాలని మండలంలోని జగత్‌రావుపేటకు చెందిన బాణోత్ కోటేష్–కుమారి దంపతులు అధికారులను వేడుకున్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. జగత్‌రావుపేటలో ఎంపీపీ ఇంటి పక్కన ఉన్న ఖాళీ స్థలమును 5 ఏళ్ల క్రితం కొనుగోలు చేశామన్నారు. ఆ భూమిలో మేము పశువుల పాక వేసుకున్న తరువాత ఎంపీపీ ఆమె తరుపు వారు భూమి మాదని వస్తున్నారని ఈ విషయంపై పోలీసులకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేశామన్నారు. మూడు నెలల క్రితం తాము వేసుకున్న పాకను మంగళవారం రాత్రి ఎంపీపీ ఆమె కుటుంబసభ్యులు తగులపెట్టి గుంజలు తీసివేశారన్నారు. ఇతర గ్రామాల నుంచివ్యక్తులను తీసుకొచ్చి తమను కొట్టేప్రయత్నం చేశారని భయంతో పారిపోవాల్సి వచ్చిందన్నారు. ఎంపీపీ నుంచి రక్షించి తమ భూమిని అప్పగించాలన్నారు. కాగా ఈ విషయంపై ఎంపీపీ మౌనికను వివరణ కోరగా తమ భూమిని ఆక్రమించుకొని అక్రమంగా పాకవేసుకొన్నారని, ప్రశ్నిస్తే తమ వారిపైనే కోటేష్ దాడి చేశాడని, ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. భూవివాదంపై కోటేష్‌తో పాటు ఎంపీపీ బంధువు కృష్ణ ఇచ్చిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కేసముద్రం: మండల కేంద్రానికి చెందిన వెంకటమ్మ, బిచ్చానాయక్‌తండా జీపీకి చెందిన గ్రామ పార్టీ మాజీ అధ్యక్షుడు భాషా బుధవారం అనారోగ్యంతో మృతిచెందాడు. ఈమేరకు మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. అనంతరం ఉద్యమకారుడు చిల్ప్యారి కరుణాకర్ ఇంటికి వెళ్లి, అతడి సమస్యలను అడిగితెలుసుకుని, డబుల్ బెడ్రూం ఇళ్ల మంజూరు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆయన వెంట జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్ రెడ్డి, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాదారపు సత్యనారాయణరావు, మండల అధ్యక్షుడు నజీర్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి కముటం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు వీరునాయక్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

‘నోపా’ సోషల్ మీడియా కన్వీనర్ ఎన్నిక

చిన్నగూడూరు: నాయీ బ్రాహ్మణ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్(నోపా) సోషల్ మీడియా కన్వీనర్‌గా మండల కేంద్రానికి చెందిన జంపాల సత్యనారాయణను ఎంపిక చేసినట్లు జిల్లా అధ్యక్షుడు కృష్ణప్రసాద్, కార్యదర్శి మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

పండ్లు పంపిణీ

డోర్నకల్: స్థానిక ఎస్సీ, ఎస్టీ హాస్టల్ విద్యార్థులకు బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. క్లబ్ పూర్వపు అధ్యక్షుడు లక్ష్మీనర్సింహరావు జన్మదినాన్ని పురస్కరించుకుని పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఆంటోని పసాల, కార్యదర్శి నలబోలు శ్రీనివాస్, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పట్టణ కమిటీ ఎన్నిక

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ పట్టణ నూర్ భాష సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ ఫయాజ్, గౌరవ అధ్యక్షుడిగా మహ్మద్ ఖాసీంసాబ్, సలహాదారుగా మహ్మద్ నాసర్, అధికార ప్రతినిధిగా మహ్మద్ అంకూస్, ఉపాధ్యక్షుడిగా షేక్ బషీర్, షేక్ ఫిరోజ్, కార్యదర్శి మహ్మద్‌పాష, ముస్తాఫా, కోశాధికారిగా షేక్ జమాల్‌తోపాటు డైరెక్టర్స్ బుధవారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వారిని కమిటీ సభ్యులు సన్మానించారు.

బీమా చేయించుకోవాలి

కురవి: రైతులు జీవిత బీమా చేయించుకోవాలని ఏఈఓ మాలోత్ రమేష్ అన్నారు. బుధవారం గుంద్రాతిమడుగు(విలేజి)లోని రైతువేదికలో రైతులతో సమావేశం నిర్వహించారు. రైతులు తమ పాస్‌బుక్స్, ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు జిరాక్స్‌లు, ఎల్ఐసీ నామిని ఫామ్‌లను అందజేయాలని సూచించారు. రైతులందరు తమ డేటాను వెరిఫై చేసుకోవాలన్నారు.

పేదల అభ్యున్నతికి కృషి

మరిపెడ రూరల్: పేదల అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ గుగులోతు అరుణ అన్నారు. మండలంలోని తండధర్మారం గ్రామానికి చెందిన గుగులోతు జీజాకు రూ.25వేల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కేలోతు ధన్‌సింగ్, నాయకులు రాంబాబు, లక్పతి, కార్యదర్శి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

డోర్నకల్: విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని నిర్మలా స్కూల్ కరస్పాండెంట్ లీనా కోరారు. స్థానిక నిర్మలా హైస్కూల్‌లో ఇటీవల స్కూల్ పీపుల్ లీడర్ తోపాటు ఇతర పదవులకు ఎన్నికలు జరగగా వివిధ పదవులకు ఎన్నికైన విద్యార్థుల ప్రమాన స్వీకారోత్సవ కార్యక్రమం బుధవారం పాఠశాలలో జరిగింది. హెచ్‌ఎం మేరీ థెరిసా, పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వివరాల సేకరణ

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వివరాలను రెవెన్యూ సిబ్బంది సేకరిస్తున్నారు. బుధవారం పోలింగ్ కేంద్రాల పరిధిలో వసతులకు సంబంధించి ముఖద్వారం, నీటి వసతి, టాయిలెట్లు, విద్యుత్ సరఫరా, ఆన్‌లైన్ సేవలు, రాంప్‌తో పాటు ఇతర వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

కూలీలకు వాన కవర్ల పంపిణీ

గూడూరు: మండలంలోని తేజావత్‌రాంసింగ్‌తండాలో బుధవారం గ్రామానికి చెందిన వరి నాటు వేసే కూలీలకు బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి బానోతు భాస్కర్‌నాయక్ సొంత ఖర్చులతో వాన కవర్లు అందించాడు.

మంత్రి పరామర్శ

తొర్రూరు రూరల్: మండలంలోని అమ్మాపురం గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన ముద్దం బక్కమ్మ(80) మృతదేహానికి మంత్రి దయాకర్ రావు పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ యాకయ్య, ఎంపీటీసీ డొనక ఉప్పలయ్య, పార్టీ అధ్యక్షుడు వీరారెడ్డి పాల్గొన్నారు.

ఏఎస్సైకి సన్మానం

కేసముద్రం: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల ఉత్తమ సేవా అవార్డు అందుకున్న ఏఎస్సై కృష్ణమూర్తిని, అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సై తిరుపతి, సంఘం మండల అధ్యక్షుడు వల్లందాసు రవి, జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి పాల్గొన్నారు.


సామాజిక కార్యక్రమాలు చేపట్టాలి

తొర్రూరు: ప్రతి ఒక్కరూ సామాజిక కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు పొందాలని లయన్స్ క్లబ్ రీజియన్ చైర్‌పర్సన్ డాక్టర్ శారద అన్నారు. క్లబ్ ఆఫ్ సేవా తరుణి ఆధ్వర్యంలో స్థానికురాలు చింతల మానస జన్మదినాన్ని పురస్కరించుకుని కస్తూర్బా పాఠశాలకు కుర్చీలు వితరణ చేశారు. లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ తమ్మెర లక్ష్మీనరసింహరావు జన్మదినాన్ని పురస్కరించుకుని మండలంలోని నాంచారి మడూరు ప్రాథమిక పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి శైలజ, సేవా తరుణి అధ్యక్షురాలు వజినెపల్లి శైలజ, కార్యదర్శి శ్రీదేవిరెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.

మానుకోటలో వృద్ధుడి అదృశ్యం

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని కంకరబోర్డు ప్రాంతానికి చెందిన వృద్ధుడు ఎండీ.జలీల్ (80) అదృశ్యమైన ఘటనలో ఆయన మనుమడు ఫైజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని టౌన్ సీఐ వై.సతీష్ బుధవారం తెలిపారు. జలీల్ (రిటైర్డ్ విద్యుత్ శాఖ లైన్ మెన్) మానసిక స్థితి సరిగా లేక ఈ ఏడాది మార్చిలో ఇంటి నుంచి బయటకు వెళ్లి మళ్లీ తిరిగి రాలేదు. ఆయన ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వర్షంలోనూ కొనసాగిన సమ్మె



కేసముద్రం: తమ సమస్యలను పరిష్కరించాలంటూ వర్షంలో తడుస్తూ జీపీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం పరిష్కరించాలంటూ నిరసన తెలిపారు. సంఘం మండల అధ్యక్షుడు మంగీలాల్, రాములు పాల్గొన్నారు.

కురవి: మండల కేంద్రంలో సమ్మె బుధవారం నాటికి 14వ రోజుకు చేరుకుంది. జేఏసీ నాయకులు మంజూర్ అలీ, లక్ష్మయ్య, షేక్ సోందు, వీరభద్రం, వీరన్న, లక్ష్మమ్మ, సుగుణమ్మ పాల్గొన్నారు.

తొర్రూరు: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులను ప్రభుత్వం గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ షరీఫ్ పాల్గొన్నారు.